సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

గురువారం । 4 । జనవరి । 2024



ఆరాధన ఉత్సవాలు ప్రారంభం
బ్రహ్మంగారిమఠంలోని శ్రీ ఈశ్వరీదేవిమఠంలో అమ్మవారి ఆరాధన గురుపూజ మహోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి.దేవదాయశాఖ, మఠం సిబ్బంది ఏర్పాట్లు చేశారు. - 8లో



సమస్యల పరిష్కారమే లక్ష్యం
గ్రామ స్థాయిలోని సమస్యలను మండల స్థాయిలో ప్రజలు సంతృప్తి చెందేలా పరిష్కరించేందుకే 'జగనన్నకు చెబుదాం'కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. - 8లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం
29.9 /21.6

జిల్లాలో బుధవారం 21.3 - 29.5 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్.

సీఎం పాలన
దేశానికే ఆదర్శం
– ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు/రైల్వేకోడూరు అర్బన్ : సామాజిక బాధ్యతతో పరిపాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి దేశంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరే అని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు తెలిపారు. బుధవారం రైల్వేకోడూరు రాజ్ రెసిడెన్స్‌లో జరిగిన మేధావులు, డాక్టర్లు, లాయర్ల సమ్మేళనంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో అధికారం చేపట్టాక కులమత వర్గ విభేదాలు లేకుండా పరిపాలన సాగించారన్నారు. ఈ సమావేశంలో ప్రముఖ వైద్యులు వెంగల్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన నాడు-నేడు పథకంలో విలేజ్‌క్లీనిక్‌లు సామాజిక ఆరోగ్య కేంద్రాల అభివృద్ధి దేశంలోనే ఆదర్శం అన్నారు. ప్రజా ఆరోగ్యం పట్ల ఆయన చూపుతున్న శ్రద్ధ అమోఘం అని ఆయన పేర్కొన్నారు. ప్రముఖ న్యాయవాది ఆర్‌సీ సురేష్‌బాబు మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా ప్రతి వర్గాన్ని ఆదరిస్తూ చట్టపరంగా ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తూ పరిపాలన చేయడం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమయిందన్నారు. అతి సామాన్యుడు కూడా చట్టాలగురించి, న్యాయాల గురించి పోలీస్‌స్టేషన్‌లకు వెళ్లకుండానే ఫిర్యాదులు చేసే వెసులుబాటు ప్రజా పరిపాలనలో రావడం ఎంతో శ్రేయస్కరం అయిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ నటుడు అలీ, రామసుబ్బారెడ్డి, అడ్వొకేట్ మధుసూదన్, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, డీఏబీ చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ ముప్పాల హేమనవర్మ, చెవ్వు శ్రీనివాసులరెడ్డి, వత్తలూరు సాయికిషోర్‌రెడ్డి, సిహెచ్.రమేష్ పాల్గొన్నారు.

సామాజిక విజయం





సభకు హాజరైన జనసందోహంలో ఒక భాగం (ఇన్‌సెట్) బస్సు యాత్రలో ప్రజలకు అభివాదం తెలుపుతున్న ప్రభుత్వవిప్ కొరముట్ల, ప్రముఖ నటుడు అలీ

- భారీ జనసందోహం నడుమ సామాజిక సాధికార బస్సు యాత్ర
- డప్పు వాయిద్యాలు, కోలాటాల మధ్య సాగిన యాత్ర
- ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీల విజయ సంకేతాలు
- ఐదు మండలాల ప్రజలతో కిటకిటలాడిన కోడూరు

రైల్వేకోడూరు/రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు పట్టణంలో బుధవారం జరిగిన సామాజిక సాధికారిక బస్సు యాత్ర విజయవంతమైంది. జనసందోహంతో కోడూరు పట్టణం కిటకిటలాడింది. సభకు ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు అధ్యక్షత వహించారు. బస్సు యాత్ర, భారీ బహిరంగ సభ , మేధావులతో సమ్మేళనం కార్యక్రమాలు విజయవంతంగా జరిగాయి. మధ్యాహ్నం స్థానిక రాజ్ రెసిడెన్సీ నుంచి టోల్‌గేట్ వరకు ఐదు మండలాల ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ నియోజకవర్గ కార్యకర్తలు, ప్రజల నడుమ సుమారు నాలుగుగంటల సేపు కొనసాగింది. బస్సు యాత్రకు ప్రజలు అడుగడుగునా జేజేలు పలికారు. దారిపొడవునా కేరళ వాయిద్యాలు, పండరీ భజనలు, ఆర్కెస్ట్రాలతో పాటు భారీ ఎత్తున బాణసంచా కాలుస్తూ టోల్ గేట్ సభా ప్రాంగణం వరకు యాత్ర కొనసాగింది. ఎన్టీఆర్ సర్కిల్, మార్కెట్ సర్కిల్, టోల్‌గేట్ వద్ద నాయకులు బస్సు యాత్రకు క్రేన్‌ల సహాయంతో గజమాలలు ఏర్పాటు చేసి స్వాగతం పలికారు. జగనన్న డీజే పాటలతో యువకులు హోరెత్తిపోయారు. టోల్‌గేట్ వద్ద వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి నివాళులర్పించి వేలాదిమంది నియోజకవర్గ ప్రజల నడుమ సామాజిక సాధికార సభను నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంపీ నందిగామ సురేష్, ప్రముఖ నటుడు అలీ, ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్, మేయర్ సురేష్‌బాబు, జెడ్పీ చైర్మన్ అమర్‌నాథ్‌రెడ్డి, సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డి, స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ కొండూరు అజయ్‌రెడ్డి హాజరయ్యారు.



మేధావుల సదస్సులో మాట్లాడుతున్న ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు

సామాజిక సాధికారతను చేతల్లో చూపిన సీఎం



28 రాష్ట్రాలలో 78 సంవత్సరాలు ఎందరో ముఖ్య మంత్రులు పరిపాలించారు, అందరూ సాధికారత గురించి మాట్లాడేవారే కానీ ఎవరూ పాటించలేదు. దేశంలో సామాజిక సాదికారకత పాటించి చూపించిన ఏకైన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే. ప్రతి ఒక్కరూ ఓట్లకోసం, సీట్లకోసం వాడుకునే వారే కాని ఏనాడు అమలు చేయలేదు. ఐదు ఉప ముఖ్యమంత్రులు, హోంమంత్రి, ఎన్నో కార్పొరేషన్ చైర్మన్‌లు, డైరెక్టర్‌లు పదవులు ఇచ్చి పరిపాలించే స్థాయికి తీసుకువచ్చిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరే. రాబోయే ఎన్నికలలో మనమంతా జగన్‌మోహన్‌రెడ్డి వెంట నడవాల్సిన బాధ్యత ఉంది.
– సురేష్‌బాబు, కడప మేయర్

➠ సామాజిక న్యాయం పాటించిన ఏకైక సీఎం జగన్
– ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు



తన రాజకీయ జీవితంలో ఐదుగురు ముఖ్యమంత్రులను చూశానని, ఏ ముఖ్యమంత్రి పాటించని సామాజిక న్యాయం పాటించి చూపించిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. 70 ఏళ్లుగా రాష్ట్రాన్ని ఎన్నో పార్టీలు , ఎందరో ముఖ్యమంత్రులు పరిపాలించారని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టాక ఎస్సీ,ఎస్టీ, బీసీ మైనార్టీల కష్టాలు తెలుసుకుని ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి వారి అభ్యున్నతికి కృషి చేశారని కొనియాడారు. రాష్ట్రంలో పరిపాలన ఎంతో అద్భుతంగా సాగుతోందన్నారు. పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా నవరత్నాలతో పాటు మరెన్నో పథకాలు ప్రవేశపెట్టి అమలు చేశారన్నారు. ప్రతి ఇంటికి పథకాలు తలుపు తట్టి మరీ అందిస్తున్న ఘనత మన జగనన్నకే సాధ్యమన్నారు. గత ప్రభుత్వాలు ముఖ్యమంత్రులు నేటి నాలుగున్నర సంవత్సర జగనన్న పరిపాలనలో తేడా ప్రజలు గమనించాలన్నారు. నాలుగు దఫాలు తనను ఎమ్మెల్యేగా కోడూరు ప్రజలు గెలిపించారని , ముఖ్యమంత్రి జగనన్న సహకారంతో తాను చేసిన అభివృద్ధిని చూడాలన్నారు. మన ప్రభుత్వం ఏర్పడ్డాక కోడూరు నియోజకవర్గంలో రూ.1600 కోట్లు అభివృద్ధి పనులకు వెచ్చించామని వెల్లడించారు. ఇంకా సంక్షేమం అభివృద్ధి చేసి కోడూరు ప్రజల రుణం తీర్చుకోవడానికి జగనన్నకు, తనకు అవకాశం ఇవ్వాలన్నారు.



కోలాటం ఆడుతున్న కళాకారులు

న్యూస్‌రీల్

ఆరోగ్యానికి అభయం
కడప రూరల్ : జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు బుధవారం జిల్లాలో 11 పట్టణ కేంద్రాల్లో జరిగాయి. ఈ కార్యక్రమాలకు స్థానిక ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు. శిబిరాలకు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై వైద్య సేవలను పొందారు. ఈ మెడికల్ క్యాంపులను జగనన్న ఆరోగ్య సురక్ష స్టేట్ కో ఆర్డినేటర్ డాక్టర్ కేవీఎన్ఎస్ డాక్టర్ అనిల్‌కుమార్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు తదితరులు పర్యవేక్షించారు.

5న జాబ్‌మేళా
కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లా ఉపాధి కార్యాలయం, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 5న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి జరిగే ఇంటర్వ్యూల్లో ఫైనాన్స్ స్మాల్ ఫైనాన్షియల్ బ్యాంకు, అమరరాజా బ్యాటరీస్, బిగ్ బాస్కెట్, పేటీఎం కంపెనీలు హాజరవుతాయన్నారు. అభ్యర్థులు టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ చదివి 18-35 ఏళ్లలోపు కలిగి ఉండాలన్నారు. అభ్యర్థులు ఇంటర్వ్యూలకు విద్యార్హతల పత్రాలు, ఫొటోలు తీసుకు రావాల్సి ఉంటుందని వివరించారు.

ఏఎఫ్‌యూ సెమిస్టర్ పరీక్షా ఫలితాలు విడుదల



పరీక్షా ఫలితాలను విడుదల చేస్తున్న వీసీ ఆచార్య బి.ఆంజనేయప్రసాద్ తదితరులు

ఏఎఫ్‌యూ : కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో కాలేజ్ ఆఫ్ ఫైన్‌ఆర్ట్స్, స్కూల్ ఆఫ్ ప్లానింగ్‌కు సంబంధించిన 3వ, 7వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫలితాలను వీసీ ఆచార్య బి. ఆంజనేయ ప్రసాద్ విడుదల చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ 3వ సెమిస్టర్ పరీక్షా ఫలితాలలో 95 శాతం మంది, 7వ సెమిస్టర్‌లో 97 శాతం మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. పరీక్షా ఫలితాలను కళాశాల వెబ్‌సైట్‌లో ఉంచినట్లు తెలిపారు. తక్కువ సమయంలోనే పరీక్షా ఫలితాలను విడుదల చేసేందుకు కృషి చేసిన పరీక్షల విభాగాన్ని అభినందించారు. డిప్యూటీ రిజిస్ట్రార్ రాజేష్‌కుమార్, సూపరింటెండెంట్ పవన్‌కుమార్‌రెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఇ.సి. సుప్రియ పాల్గొన్నారు.

బీఎల్‌ఓ సస్పెన్షన్
చిట్వేలి : చిట్వేలి మండలం, నాగవరం వడ్డిపల్లి పోలింగ్ కేంద్రం 39 బీఎల్‌ఓ గంగాధర్‌ను ఉన్నతాధికారులు సస్పెండ్ చేసినట్లు తహశీల్దార్ శిరీషా తెలిపారు. గంగాధర్ నాగవరం సచివాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ నాగవరం బీఎల్‌ఓగా విధులు నిర్వహిస్తున్నాడు.



దొంగమూల ప్రాంతంలో బుధవారం కనిపించిన చిరుత కాలి గుర్తులు

అమ్మో..పులి

చక్రాయపేట : మండలంలోని సురభి గ్రామం పాయలోపల్లె వద్ద బుధవారం చిరుత కనిపించడంతో గ్రామస్తులు భయంతో పరుగులు తీశారు. విషయం తెలియగానే మామిడి తోటల్లో ఉన్న రైతులు సైతం పరుగులు తీస్తూ ఇళ్లకు చేరారు. ప్రత్యక్షంగా చూసిన శంకర్, మహేశ్వర్ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఉదయం దొంగమూల ప్రాంతంలో ఉన్న అడవికి పాడి పశువులను మేత కోసం తోలు కెళుతుండగా ఎదురు వైపు నుంచి చిరుత రావడం గుర్తించామని చెప్పారు. వెంటనే గట్టిగా కేకలు వేస్తుండగా చిరుతను చూచిన పశువులు బెదిరి వెనకకు పరుగులు తీశాయన్నారు.వెటనే తాము గ్రాస్థులకు ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వగానే అందరూ వచ్చి పెద్ద ఎత్తున టపాకాయలు కాలుస్తూ గట్టిగా కేకలు వేయడంతో చిరుత అడవిలోకి వెళ్లి పోయిందని చెప్పారు. నెల రోజులుగా చిరుత ఈ ప్రాంతంలోనే సంచరిస్తోందన్నారు. ఊరికి కిలోమీటరు దూరంలోనే చిరుత కనిపించడంతో గ్రామస్థులు భయాందోళనలకు గురవుతున్నారు.ఊరు చుట్టూ పెద్ద పెద్ద మామిడి తోటలు ఉన్నాయని ఒంటరిగా తోటల్లోకి వెళ్లాలంటే కూడా భయమేస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.అటవీ శాఖ అధికారులు స్పందించి చిరుతను పట్టుకోవాలని పాయలోపల్లె వాసులు కోరుతున్నారు.

అభినందన



విజేతలను అభినందిస్తున్న రత్నకుమారి

కడప రూరల్: వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం జోన్-4లో తిరుపతిలో నిర్వహించిన రాయలసీమ మినిస్ట్రీరియల్ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్‌లో తిరుపతి జిల్లా జట్టుపై వైఎస్సార్ జిల్లా జట్టు విజయం సాధించింది. ఈ సందర్భంగా జట్టు సభ్యులు ట్రోఫీతో బుధవారం స్థానిక వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయంలో రీజనల్ డైరెక్టర్ డాక్టర్ రత్నకుమారిని కలిశారు. ట్రోఫీని అందజేశారు. ఈ సందర్భంగా రత్నకుమారి విజేతలను అభినందించారు. కార్యక్రమంలో జిల్లాకు చెందిన మినిస్ట్రీరియల్ సిబ్బంది క్రికెట్ కెప్టెన్ సతీష్, రవి, బాలాజీ, నాగార్జున పాల్గొన్నారు.

వివరాలు భద్రం..
వైద్యం సులభం



ఆవుల యజమానులకు ఆరోగ్య సంరక్షణ కార్డులు అందిస్తున్న అధికారులు

- ఆరోగ్య సంరక్షణ కార్డులు అందజేసేందుకు ప్రభుత్వం చర్యలు
- ఆరు పెద్ద పశువులకు ఒక కార్డు
- గొర్రెలు, మేకలు 20 వాటికి కలిపి ఒక కార్డు

కడప అగ్రికల్చర్: పశు వైద్యం.. మరింత చేరువ కానుంది. మూగ జీవాలకు మంచి వైద్యం అందేలా ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టింది. పశువులకు కూడా ఆరోగ్య సంరక్షణ కార్డులు తయారు చేసి వాటి జారీకి శ్రీకారం చుట్టింది. జిల్లాలో పశువుల సంఖ్య వాటికి కావాల్సిన మందులు ఇతర అంశాలకు ఉపయోగపడేందుకు ఈ కార్డు అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంది. ఈ మేరకు ఈ కార్యక్రమం జిల్లాలో ముమ్మరంగా నడుస్తుంది.

ఆరోగ్య కార్డు గుర్తింపు ఇస్తారిలా...

గేదులు, పశువులు, మూగజీవాలకు సంబంధించిన వివరాలు ఆన్‌లైన్ చేస్తారు. ఇందులో ఆరు పెద్ద పశువులకు ఒక కార్డు, మేకలు/గొర్రెలు కలిపి 20 వాటికి ఒక కార్డును అందజేస్తారు. ఇందుకు సంబంధించి అన్ని వివరాలు ఆన్‌లైన్ చేసి హాలోగ్రామ్‌తో కూడిన పది అంకెల సంఖ్యలో పొందుపరిచి గుర్తింపు కార్డు ఇస్తున్నారు. ఈ హాల్‌గ్రామ్‌ను స్కాన్ చేసినప్పుడు ఆ నెంబర్‌తో ఎన్ని జీవాలు ఉన్నాయి. రైతు ఎవరు, ఆయా పశువులకు ఎలాంటి వ్యాధులు ఉన్నాయి, వంటి వివరాలు తెలుస్తాయి.

ఉపయోగాలివే...

ఒకప్పుడు పొడవాటి కరపత్రంలా ఉన్న పశు ఆరోగ్య కార్డును ఇచ్చేవారు. అలాంటివి తాజాగా హ్యాండ్ బుక్ మాదిరిగా రూపొందించి ప్రింట్ చేసి పాడి రైతులకు ఉచితంగా ఇస్తున్నారు. రైతు భరోసా కేంద్రాలు, పశువైద్యశాఖ సిబ్బంది వీటిని రిజిస్టర్ చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పశు సంవర్ధకశాఖ తరపున రెండు రకాల యానిమల్ హెల్త్ (పశు ఆరోగ్య సంరక్షణ) కార్డులను జారీ చేస్తోంది. అందులో ఒకటి పశు ఆరోగ్య సంరక్షణ కార్డు. ఇది ఆరు ఆవులు, గేదెలు మాత్రం వర్తిస్తుంది. రెండవది గొర్రెలు, మేకలకు ఆరోగ్యం సంరక్షణ కార్డు అందచేస్తారు. గొర్రెలు, మేకలకు అయితే 20 జీవాలకు ఒక ఆరోగ్య సంరక్షణ కార్డు అందచేస్తారు. ఈ కార్డులో జీవాల సంఖ్య వివరాలు, పశు పోషకుల వివరాలు పొందుపరచి ఉంటాయి. వ్యాధుల నుంచి టీకాల వరకు సమస్త సమచారం కార్డులో నిక్షిప్తమై ఉంటుంది. మూగజీవాలకు ఏవైనా అనారోగ్య సమస్యలు ఉంటే ఈ కార్డుతో చికిత్స అందించడం సులభమవుతుంది. జిల్లావ్యాప్తంగా 1,77,613 కుటుంబాలకు పశువుల ఆరోగ్యం సంరక్షణ కార్డులు అందించనున్నారు. ఇప్పటివరకు జిల్లాలో 70,058 వేల కుటుంబాల వారికి ఆరోగ్యం సంరక్షణ కార్డులను పంపిణీ చేశారు. మిగతా కార్డులను కూడా త్వరలో అందచేయనున్నారు.

జిల్లాలో ఉన్న బర్రెలు, ఎద్దుల సంఖ్య	: 4,44,560
జిల్లాలో బర్రెలు, ఎద్దులు కలిగి ఉన్న కుటుంబాల సంఖ్య	: 1,77,613
జిల్లాలో గొర్రెలు, మేకలు సంఖ్య	: 13,46,266
గొర్రెలు, మేకలు కలిగి ఉన్న కుటుంబాల సంఖ్య	: 25,600
జిల్లాలో మొత్తం కుటుంబాల సంఖ్య	: 1,77,613
ఇప్పటి వరకు కార్డులు పంపిణీ చేసిన కార్డులు	: 70058 కుటుంబాలు



ప్రతి ఒక్కరూ ఆరోగ్య సంరక్షణ కార్డులు పొందాలి...



జిల్లాలో పాడి రైతులు, గొర్రెల కాపరులు వారి పశువులు, జీవాలకు సంబంధించిన ప్రతి ఒక్కరూ ఆరోగ్య సంరక్షణ కార్డులు పొందాలి. పశువుల ఆరోగ్య సంరక్షణ కార్డుల వివరాలను పశు వైద్య సిబ్బంది రిజిస్టర్ చేస్తారు. పశుగణన, వ్యాధుల నివారణ, ప్రభుత్వం నుంచి అందించే ఉచిత మందులు, టీకాల వివరాలు, పశు భీమా ఇలా ప్రతి దానికి పశు ఆర్యోగ సంరక్షణ కార్డులు ఉపయోగపడతాయి.
– డాక్టర్ శారదమ్మ, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి

పెన్షన్‌దారుల పరవశం

- పెన్షన్ కానుక రూ. 3000కు పెంపు
- జిల్లాలో 2,68,357 మందికి లబ్ధి
- నెలకు రూ. 79.42 కోట్లు
- డీఆర్వో గంగాధర్‌గౌడ్



మెగా చెక్కును లబ్ధిదారులకు అందజేస్తున్న డీఆర్వో గంగాధర్‌గౌడ్

కడప సెవెన్‌రోడ్స్ : రాష్ట్ర ప్రభుత్వం అవ్వాతాతలకు నూతన సంవత్సర కానుకగా పెన్షన్ మొత్తాన్ని రూ.3000కు పెంచడం ఆనందదాయక విషయమని డీఆర్వో గంగాధర్ గౌడ్ అన్నారు. బుధవారం కాకినాడ బహిరంగ సభ నుంచి ×పెంచిన వైఎస్ఆర్ పెన్షన్ కానుక మొత్తాన్ని లబ్ధిదారులకు నేరుగా అందజేసే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వీసీ ద్వారా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కలెక్టరేట్ వీసీ హాలు నుంచి డీ ఆర్వో గంగాధర గౌడ్, డీఆర్డీఏ పీడీ ఆనంద్ నాయక్, అధికారులు హాజరయ్యారు. వీసీ ముగిశాక జిల్లాకు చెందిన 2,68,357 మంది లబ్దిదారులకు మంజూరైన వైఎస్ఆర్ పెన్షన్ కానుక లబ్ధి మొత్తం రూ.79,42,42,000,00 మెగా చెక్కును డీఆర్వో లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ప్రభుత్వం విడుదల చేసిన ×వైఎస్ఆర్ పెన్షన్ కానుక పథకం వివరాలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'మీ పింఛను- మీ గడప వద్దకే' పథకం అమలు తీరుపై ఇప్పటికే జిల్లాలోని లక్షలాది మంది లబ్ధిదారులు సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రతి నెలా వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, కల్లు గీత కార్మికులు, చర్మకారులు, నేతన్నలకు అందజేసే పింఛను మొత్తాన్ని క్రమక్రమంగా రూ.3000ల వరకు పెంచుతామని ఇచ్చిన హామీని రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చి ప్రజల్లో నిజమైన భరోసాను నింపిందన్నారు. వైఎస్ఆర్ జిల్లాలో పలు రకాల పింఛన్లు అందుకుంటున్న 2,68,357 మంది లబ్ధిదారులకు ఈ జనవరి నెలకు గాను రూ. 79.42 కోట్లను అందజేయడం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ, మెప్మా అధికారులు, సచివాలయ సిబ్బంది, బ్యాంకు అధికారులు, వృద్ధులు, పలువురు పెన్షన్ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన పెన్షన్‌తో సంతోషం



వైఎస్సార్ పెన్షన్ కానుకతో మా కుటుంబం సంతోషంగా ఉంది. నాలుగేళ్లుగా ప్రతి సంవత్సరం ప్రారంభంలో పెంచిన పెన్షన్‌ను అందుకోవడం సంతోషంగా ఉంది. నాకు వృద్ధాప్య పెన్షన్‌తోపాటు మా పిల్లల కుటుంబాలు కూడా లబ్ధి పొందుతున్నాయి. ఏ చీకుచింత లేకుండా జీవిస్తున్నాం. జగనన్న ప్రభుత్వంలో సుభిక్షంగా ఉన్నాం.
– వాణిమూర్తి, అరవింద్ నగర్ – 2, కడప

గతంలో పడిగాపులు కాసేవాళ్లం



ఈ జనవరి నుంచి రూ.3,000ల పెన్షన్ మొత్తాన్ని అందజేస్తున్న ముఖ్యమంత్రికి ధన్యవాదాలు. ఇచ్చిన మాట ప్రకారం అన్ని హామీలు నెరవేరుస్తున్న జగన్‌కు జీవితాంతం రుణపడి ఉంటాం . ఏ పనీ చేయలేని మాలాంటి వద్దులకు ఈ పింఛన్ ఎంతో ఉపయోగపడుతుంది. గతంలో నెలనెలా పింఛన్ కోసం ఆఫీసుల చుట్టూ తిరిగేవాళ్లం.
– కె.సుబ్బారాయుడు, ప్రకాష్ నగర్, కడప

వలంటీర్ల సేవలు భేష్



గ్రామ, వార్డు వలంటీర్ల ద్వారా.. ఇంటివద్దకే వచ్చి పెన్షన్ అందిస్తున్నారు. వార్డు, గ్రామ వలంటీర్ల నియామకాలను ముఖ్యమంత్రి ఎందుకు చేపట్టారో ఇప్పుడు అర్థమవుతోంది. నవరత్నాల పథకాల కోసం ఇల్లిల్లూ తిరిగి అర్హులైన వారందరికీ న్యాయం చేశారు. పెన్షన్ మొత్తాన్ని రూ.3000 పెంచి సీఎం తన హామీని పరిపూర్ణంగా నెరవేర్చారు.
– మణి కన్నన్, అరవిందనగర్, కడప.

క్లుప్తంగా

జాతీయస్థాయి పోటీలకు నలుగురు ఎంపిక



షీల్డ్ అందుకుంటున్న మాస్టర్ నాయబ్‌రసూల్

పోరుమామిళ్ల : విజయవాడ కృష్ణలంకలో జరిగిన రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో పోరుమామిళ్ల క్రీడాకారులు నలుగురు బంగారు పతకాలు సాధించారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపి య్యారు. మరో నలుగురు రజత పతకాలు సాధించినట్లు మాస్టర్ నాయబ్‌రసూల్ చెప్పారు. జూనియర్స్ విభాగంలో సాయిప్రీతి, నయూమ్, సాయిమనోజ్, సీనియర్ విభాగంలో సంగా భవ్య బంగారు పతకాలు, అషిక్, మాహిర్, తస్లీ, ఉస్మాన్ రజతపతకాలు సాధించారు.ఈ నెల 19 నుంచి రాజస్థాన్‌లో జరిగే పోటీల్లో బంగారు పతకాలు సాధించిన నలుగురు పాల్గొంటారని తెలిపారు. కృష్ణలంక పోటీల్లో కోచ్, మేనేజర్‌గా ఉస్మాన్, సుభాన్‌లు వ్యవహరించారన్నారు.

యోగా టీచర్‌పై పోక్సో కేసు

గుత్తి రూరల్ : మండలంలోని ఓ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యోగా ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న పల్లపోతుల అనిల్‌కుమార్‌రెడ్డిపై పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. వివరాలు... వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు మండలం చౌడూరు గ్రామానికి చెందిన అనిల్‌కుమార్‌రెడ్డి కొంత కాలంగా గుత్తి మండలంలోని ఓ జెడ్పీహెచ్ఎస్‌లో యోగా టీచర్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బుద్ధ యోగా సొసైటీ పరిధిలో ఔట్‌సోర్సింగ్ కింద పనిచేస్తున్న ఆయన గత డిసెంబర్ 25న తాను పనిచేస్తున్న పాఠశాలలోని పదో తరగతి విద్యార్థినిని మాయమాటలతో లోబర్చుకుని పిలుచుకెళ్లాడు. ఆ సమయంలో ఇంట్లోని ఐదు తులాల బంగారు నగలతో పాటు ఆమె వెళ్లిపోయింది. విషయం తెలుసుకున్న విద్యార్థిని తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన పోలీసులు.. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అనిల్‌కుమార్‌రెడ్డి ఉన్న ప్రాంతాన్ని పసిగట్టి మంగళవారం రాత్రి అక్కడకు చేరుకుని ఇద్దరినీ పిలుచుకుని గుత్తికి వచ్చారు. విచారణ అనంతరం బుధవారం రాత్రి బాధితురాలి ఫిర్యాదు మేరకు అనిల్‌కుమార్‌రెడ్డిపై కిడ్నాప్, పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. కాగా, సదరు యోగా టీచర్‌పై వైఎస్సార్ జిల్లాలోనూ పోక్సో కేసుతో పాటు మరో రెండు కేసులు ఉన్నట్లు పోలీసుల విచారణలో వెలుగు చూసింది.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

జిల్లా కలెక్టర్ విజయ రామరాజు



సమస్యలను కలెక్టర్ విజయరామరాజుకు వివరిస్తున్న ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి

దువ్వూరు : గ్రామ స్థాయిలోని సమస్యలను మండల స్థాయిలో ప్రజలు సంతృప్తి చెందేలా పరిష్కరించేందుకే 'జగనన్నకు చెబుదాం'కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ విజయరామరాజు తెలిపారు. బుధవారం దువ్వూరు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మండల స్థాయి 'జగనన్నకు చెబుదాం'కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ విజయరామరాజు, ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి, జేసీ గణేష్‌కుమార్, జమ్మలమడుగు ఆర్డీఓ శ్రీనివాసులు ప్రజలనుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కేంద్రానికి రాలేని వారి సమస్యలను స్థానికంగా పరిష్కరించే దిశగా మండల స్థాయిలో ప్రతి బుధ, శుక్రవారాల్లో ఒక్కో రోజు ఒక్కో మండలంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. మండలంలో రెవెన్యూ, విద్యుత్, పారిశుధ్యం, గృహ నిర్మాణం, వలంటీర్లపై ఫిర్యాదులు అధికంగా వస్తున్నాయని, వీటిని వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఆర్డీఓ శ్రీనివాసులును ఆదేశించారు. ఇడమడక, చిన్నశింగనపల్లె, కానగూడూరు, ఎర్రబల్లె, కృష్ణంపల్లె, గుడిపాడు, చింతకుంట సచివాలయాల నుంచి ఎక్కువ ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. నీలాపురం వద్ద ఉన్న సుగాలి తాండాకు రోడ్డు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వంకపై బ్రిడ్జి నిర్మించి రోడ్డు మంజూరు చేయాలని నీలాపురం గ్రామ సర్పంచ్ పల్లె రామయ్య, గ్రామస్తులు కలెక్టర్‌ను కోరారు. మండల కేంద్రంలో బస్టాండ్, మరుగుదొడ్లు నిర్మించాలని, స్టేట్ బ్యాంకు వద్ద నుంచి దేవాన్ష కల్యాణ మండపం వరకు రోడ్డు మురుగు నీరు పారుతోందని, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి కలెక్టర్‌ను కోరారు. ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి మాట్లాడుతూ ప్రజల వద్దకు పాలన దువ్వూరు మండలంలో ప్రత్యక్షంగా కనిపిస్తోందని తెలిపారు. అర్హత ఉండి ప్రభుత్వ పథకాలు అందుకోని వారు వెంటనే వారి పరిధిలోని సచివాలయాల్లో దరఖాస్తులను సమర్పించి ప్రభుత్వ పథకాల లబ్ధిని పొందాలన్నారు. 'జగనన్నకు చెబుదాం'ద్వారా ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నా జిల్లా కలెక్టర్ విజయరామరాజు, జిల్లా అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా వచ్చిన 118 అర్జీలను ఆయా శాఖల అధికారులు త్వరగా పరిష్కరించాలని జేసీ గణేష్ కుమార్ అధికారులను కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయశాఖ సలహాదారుడు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, మైదుకూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయ కర్త శెట్టిపల్లె నాగిరెడ్డి, తహసీల్దార్ రమకుమారి, ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి, జెడ్పీటీసీ మేరువ కృష్ణయ్య, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఎన్జీఓల క్యాలెండర్‌ను ఆవిష్కరణ

కడప రూరల్ : కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో బుధవారం కలెక్టర్ విజయరామరాజు ఏపీ ఎన్జీఓ అసోషియేషన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు బీ శ్రీనివాసులు, కార్యదర్శి డీ రవికుమార్, తిమ్మారెడ్డి, నిత్యపూజయ్య, చిన్నయ్య, శైలేశ్వర్‌రెడ్డి, రాజు, పద్మనాభం, మోహన్‌రెడ్డి, కాటమయ్య పాల్గొన్నారు.

సమ్మె విరమించి విధుల్లో చేరండి

కడప సెవెన్‌రోడ్స్ : అంగన్వాడీలు తమ సమ్మె విరమించి తక్షణమే విధుల్లో చేరాలని కలెక్టర్ విజయరామరాజు కోరారు. బుధవారం కలెక్టరేట్‌లో జేసీ గణేష్ కుమార్, కమిషనర్ ప్రవీణ్‌చంద్, ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, సీహెచ్ఓలు, ఎంఎస్ఓలతో ప్రత్యేకంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమ్మెవల్ల బాలింతలు, గర్భిణులు, చిన్నారుల ఆరోగ్య సంరక్షణ, పోషణకు ఇబ్బంది కలుగుతోందన్నారు. ప్రభుత్వం కూడా చాలా డిమాండ్లు నెరవేర్చినందున సమాజ శ్రేయస్సు దృష్ట్యా సమ్మె విరమించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల కార్యక్రమాలను జనవరి, ఫిబ్రవరి మాసాల్లో ప్రణాళిక బద్ధంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. జనవరి 23న వైఎస్సార్ ఆసరా, నాల్గవ విడత రుణమాఫీ పంపిణీ, ఫిబ్రవరి 5న వైఎస్సార్ చేయూత పథకాల ఫలాల పంపిణీ నిర్వహించాలన్నారు. రెండో విడత ఆరోగ్య సురక్ష సర్వే కార్యక్రమాన్ని ప్రతి వారం ప్రణాళిక బద్ధంగా పూర్తి చేయాలన్నారు. ఫిబ్రవరి 18లోపు అన్ని పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన వసతులు సమకూర్చాలని ఆదేశించారు. ఆడుదాం ఆంధ్ర నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.

హామీలు అమలు చేయాలి:సీఐటీయూ

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు డిమాండ్ చేశారు. సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకత్వంలో అంగన్వాడీలు బుధవారం కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి, అధ్యక్షుడు వేణుగోపాల్ పాల్గొన్నారు.

నవశకం



వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిరిగినా లభించని సర్టిఫికెట్లు నేడు జగనన్న సురక్ష ద్వారా సత్వరమే అందుతున్నాయి. సర్కారు బడుల రూపు రేఖలు నాడు-నేడుతో పూర్తిగా మారిపోయాయి. పేదల సొంతింటి కల సాకారమవుతోంది. వెరసి పేదల బతుకులు బాగుపడ్డాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

–సాక్షి నెట్‌వర్క్

రెండు రోజుల వ్యవధిలోనే ధ్రువీకరణ పత్రాలు వచ్చాయి



ఒక్క రూపాయి ఖర్చు లేకుండానే రెండు రోజుల వ్యవధిలోనే ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు వచ్చాయి. గతంలో ధ్రువీకరణ పత్రాలు కావాలంటే మండల కేంద్రానికి వెళ్లి దరఖాస్తు చేసుకునేవారము. అయినా సకాలంలో వచ్చేవి కావు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా స్థానిక సచివాలయంలోనే అవసరమైన వారికి ధ్రువీకరణ పత్రాలు అందజేస్తామని వలంటీర్ ప్రవీణ్ చెప్పడంతో నేను దరఖాస్తు చేసుకున్నాను. దరఖాస్తు చేసుకున్న రెండు రోజుల వ్యవధిలోనే ధ్రువీకరణ పత్రాలు వచ్చాయని, సచివాలయం వద్దకు వచ్చి తీసుకెళ్లాలని వలంటీర్ చెప్పడంతో తాము వెళ్లి ధ్రువీకరణ పత్రాలు తీసుకున్నాము. గత ప్రభుత్వ హయాంలో ఏ సర్టిఫికెట్ కావాలన్నా రోజుల తరబడి తిరగాల్సిన పరిస్థితి ఉండేది. జగనన్న ప్రభుత్వ హయాంలో ఇంటి వద్దకే పథకాలు వస్తుండటంతో హర్షం వ్యక్తం చేస్తున్నాము.

- బెల్లం మల్లేశ్వరి, కాలువపల్లె, గోపవరం మండలం

నెరవేరిన సొంతింటి కల



నా పేరు హైమావతి. నేను వైఎస్ చిన్నకొండారెడ్డి కాలనీలో అద్దె ఇంట్లో నివాసం ఉండేదాన్ని.. అనేకమార్లు పక్కా గృహం కోసం దరఖాస్తు చేసినా ఇళ్లు రాలేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో చెప్పిన విధంగా నిరుపేదలకు సొంతింటి కల నెరవేర్చే జగనన్న కాలనీల పేర్లతో ఊర్లు నిర్మిస్తున్నారు. ఆ ఊర్లలో నాకు సొంతిళ్లు రావడం చాలా ఆనందంగా ఉంది. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మా కుటుంబ సభ్యులందరం రుణపడి ఉంటాం.

- హైమావతి (ఇంటి లబ్ధిదారురాలు), పులివెందుల

ఈశ్వరీదేవి ఆరాధన ఉత్సవాలు ప్రారంభం



కలశోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంగారిమఠంలోని శ్రీ ఈశ్వరీదేవిమఠంలో అమ్మవారి ఆరాధన గురుపూజ మహోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఉదయం ప్రభాత సేవ, పంచామృతాభిషేకం కుంకుమార్చన నిర్వహించారు. జగన్మాత శ్రీ ఈశ్వరీదేవిని ప్రత్యేకంగా అలంకరించారు. మధ్యాహ్నం నివేదన, నీరాజనం, తీర్థప్రసాద వినియోగం చేపట్టారు. సాయంత్రం సూక్త పారాయణం, కుంకుమార్చన చేశారు. రాత్రి కలశోత్సవం, కలశస్థాపన తదితర కార్యక్రమాలను జరిపారు. ఉభయదాతలుగా కడప వీరబోయిన సుబ్బనరసింహులు, లక్ష్మి, గుంటూరుకు చెందిన కోడూరు సాంబశివారావు వ్యవహరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, అమ్మవారిని దర్శించుకున్నారు. వారికి ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా మఠాధిపతి శ్రీ వీరశివ కుమారస్వామి ఆశీస్సులతో ఈఓ బీవీ జగన్‌మోహన్ రెడ్డి పర్యవేక్షణలో సిబ్బంది ఏర్పాట్లు చేశారు. ముత్తలూరు అంజనేయశర్మ, రఘువు వెంకటసుబ్రమణ్యాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి చీర అందిస్తున్నాం

ఈశ్వరీదేవి ఆరాధన మహోత్సవాల సందర్భంగా అమ్మవారికి రాష్ట్ర విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఆధ్వర్యంలో చీర, సారె చీరను అందిస్తున్నామని రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు పావలూరు హనుమంతరావు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 5న అమ్మవారు సజీవ సమాధి నిష్ఠ వహించిన రోజున రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన మహిళలు పాల్గొని చీర, సారె ఇవ్వనున్నట్లు తెలిపారు. ఏపీ విశ్వబ్రాహ్మణ సంఘం న్యాయ సలహాదారు, చైర్మన్ గురుప్రసాద్, సీతారామ ఆచార్య, సుధాకర్, ఎంపీటీసీ మనోహరాచారి, మఠం పెద్దాచార్యులు భద్రయ్యాచారి, విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కారు, టాటా ఏస్ ఢీ

ఒకరి మృతి, నలుగురికి తీవ్రగాయాలు



బాలరాజు మృతదేహం వద్ద విలపిస్తున్న భార్య లక్ష్మీదేవి



చికిత్సపొందుతున్న బాలనరసింహులు





నుజ్జునుజ్జయిన కారు, టాటా ఏస్

పోరుమామిళ్ల : పోరుమామిళ్లకు 3 కిలోమీటర్ల దూరంలో బద్వేలు రోడ్డులో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో పోరుమామిళ్ల మండలం మార్కాపురం దళితవాడకు చెందిన సగిలి బాలరాజు (45) మృతి చెందాడు.పోరుమామిళ్లకు చెందిన బాలనరసింహులు, మహబూబ్ పీరా, బాషా, దంతెలపల్లెకు చెందిన విజయకుమార్ గాయపడ్డారు. బాలనరసింహులు పరిస్థితి విషమంగా ఉండటంతో కడప రిమ్స్‌కు తరలించారు. పోలీసుల కథనం మేరకు వివరాలు..

పోరుమామిళ్లకు చెందిన పీఎస్ఆర్ సప్లయర్స్‌కు చెందిన షామియానా సామగ్రిని బాలరాజు బి. కోడూరు నుంచి టాటాఏస్‌లో తీసుకొని పోరుమామిళ్లకు బయలుదేరాడు. దంతెలపల్లెకు చెందిన ఆదినారాయణరెడ్డి కారు డ్రైవర్ విజయకుమార్ పోరుమామిళ్ల నుంచి దంతెలపల్లె వెళుతుండగా రెండు వాహనాలు ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. రెండు వాహనాలు నుజ్జు నుజ్జయ్యాయి. ఈ ఘటనలో టాటాఏస్ వాహనం నడుపుతున్న బాలరాజు తీవ్రగాయాలతో మృతి చెందాడు. అందులో ఉన్న మిగతా ముగ్గురు గాయపడ్డారు. కారు నడుపుతున్న విజయకుమార్, టాటాఏస్‌లో ఉన్న మహబూబ్‌పీర్ స్వల్పగాయాలతో బయటపడ్డారు. కారులో డ్రైవర్ ఒక్కడే ఉన్నాడు. మృతుడు బాలరాజు మార్కాపురం సగిలి శాంతయ్య కుమారుడు. ఇతినికి భార్య లక్ష్మీదేవి, కుమార్తె, కుమారుడు ఉన్నారు. భర్త మరణాన్ని తట్టుకోలేక లక్ష్మీదేవి కన్నీరుమున్నీరవుతోంది.

విషయం తెలియగానే ఎస్ఐ మల్లికార్జునరెడ్డి ఆసుపత్రికి వెళ్లి క్షతగాత్రులతో మాట్లాడారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం

సుండుపల్లె (రాయచోటి టౌన్) : సానిపాయి రేంజ్ రాయవరం సెక్షన్ ముడుంపాడు బీట్‌లో మంగళవారం రాత్రి ఆరు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్టు చేసినట్లు సానిపాయి రేంజ్ ఆఫీసర్ కె. పీరయ్య తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మంగళవారం రాత్రి సానిపాయి రేంజ్ రాయవరం సెక్షన్ ముడుంపాడు బీట్‌లోని స్లోప్ రిజర్వ్ ఫారెస్టులో తనిఖీ నిర్వహిస్తుండగా తమిళనాడు రాష్ట్రానికి చెందిన మణికండన్ అనే నిందితుడు జీజే 01హెచ్ 9361 నంబర్ కారులో 97 కిలలో బరువున్న ఆరు దుంగలతో పట్టుబడినట్లు చెప్పారు. కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు.దాడుల్లో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ రమేష్ బాబు, సిబ్బంది ఏ. అంజనా స్వాతి, బి. లక్ష్మిప్రసన్న, లీలా హరి, ఎం నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి 9 గంటల విద్యుత్

ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ ఎన్‌వీఎస్ సుబ్బరాజు



అధికారులతో మాట్లాడుతున్న ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ ఎన్‌వీఎస్ సుబ్బరాజు

ప్రొద్దుటూరు క్రైం : వ్యవసాయానికి పగటి పూట నిరంతరాయంగా 9 గంటల పాటు విద్యుత్‌ను అందిస్తున్నట్లు ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ (టెక్నికల్) ఎన్‌వీఎస్ సుబ్బరాజు తెలిపారు. ప్రొద్దుటూరులోని కొర్రపాడురోడ్డులో ఉన్న సబ్‌స్టేషన్‌ను ఆయన బుధవారం తనిఖీ చేశారు. అనంతరం డీఈఈ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. పాత బకాయిల వసూలుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి సర్వీసు డబ్బు వసూలు కావాలన్నారు. విద్యుత్ బిల్లులు, లో ఓల్టేజి ఇతర సమస్యల కోసం 1912 నంబర్‌కు కాల్ చేసేలా వినియోగదారుల్లో అవగాహన కల్పించాలని చెప్పారు. ట్రాన్స్‌ఫార్మర్లు ఫెయిల్యూర్ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈదురు గాలులు, వర్షాలకు ట్రాన్స్‌ఫార్మర్లు ట్రిప్ కాకుండా చూడాలన్నారు. ఇందు కోసం లైన్ల పక్కన ఉన్న చెట్ల కొమ్మలను తొలగించాలని తెలిపారు. ఆర్డీఎస్ఎస్ కింద గ్రామాలకు ప్రత్యేకంగా ఫీడర్లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఫీడర్ల కోసం జిల్లా వ్యాప్తంగా రూ. 900 కోట్లు ఖర్చు చేస్తున్నామని వివరించారు. త్వరలో కొత్త సబ్‌స్టేషన్లను కూడా ఏర్పాటు చేయబోతున్నట్లు చెప్పారు. చాలా ప్రాంతాల్లో వీధిలైట్లు పగలే వెలుగుతున్నాయన్నారు. విద్యుత్ చాలా విలువైందని, పగలు వీధి లైట్లు వెలిగితే సంబంధిత అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని చెప్పారు. ఎలాంటి సమస్య రాకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న వెంటనే రైతులకు వ్యవసాయ మీటర్లను మంజూరు చేయాలన్నారు. రైతుల విషయంలో అలసత్వం వహించరాదన్నారు. కొర్రపాడు రోడ్డులోని సబ్‌స్టేషన్ సిబ్బంది యూనిఫాంలో ఉండగా ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ వారిని పిలిపించి మాట్లాడారు. యూనిఫాం ఎక్కడా చూడలేని, ఇక్కడ యూనిఫాం ఇవ్వడంపై ఆయన అధికారులను అభినందించారు. సమావేశంలో ప్రొద్దుటూరు పట్టణ డీఈఈ శ్రీనివాసులరెడ్డి, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నార్త్ ప్రియదర్శన్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జీ శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : స్థానిక ఆరో వార్డు పరిధిలోని బీజేపీ నాయకులు గడ్డం నరసింహులు ఆధ్వర్యంలో 300 కుటుంబాలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరాయి. బుధవారం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గడ్డం నరసింహులు బీజేపీ కౌన్సిలర్‌గా పోటీ చేశారన్నారు. ముఖ్యమంత్రి జగన్ పేదల సంక్షేమానికి చేస్తున్న కృషిని గమనించి స్వచ్ఛందంగా పార్టీలో చేరారన్నారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ జయంతి, వార్డు ఇన్‌చార్జి సురేష్‌యాదవ్, 4వ వార్డు కౌన్సిలర్ వరికూటి ఓబుళరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, ఆర్‌పీసీప మెంబర్ కాకర్ల నాగేశ్వరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేణిగుంట వరకు నంద్యాల డెమో!

రాజంపేట : నంద్యాల-కడప మధ్య నడిచే డెమో ప్యాసింజర్ రైలు కడప రైల్వేస్టేషన్‌ను వదలింది. 07284/07285 నంబరుతో నడుస్తున్న డెమోను పొడిగించాలనే ప్రతిపాదనకు ఏడాది తర్వాత బుధవారం రైల్వేశాఖ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. నంద్యాల, కడప, అన్నమయ్య జిల్లాలకు చెందిన వారు తిరుపతి వైపు వెళ్లేందుకు అనువుగా ఉంటుందనే డెమోను రేణిగుంట వరకు పొడిగించే ప్రతిపాదనను తీసుకొచ్చారు.

- ఈనెల 6న రేణిగుంటలో నంద్యాల-డెమో రైలు పొడిగింపునకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వనున్నారు. ఈమేరకు రైల్వేశాఖ సన్నద్ధమవుతోంది.వివిధశాఖల అధికారులకు తొలిరోజున విధులు కేటాయింపులు కూడా చేశారు.

ఉదయంపూట తిరుపతికి రైలుసౌకర్యం

నంద్యాలతోపాటు ఉభయ వైఎస్సార్ జిల్లాలకు చెందిన యాత్రికులు నేరుగా తిరుపతికి వెళ్లేందుకు వీలుగా డెమో నడపాలని అభ్యర్థిస్తున్నారు. వెంకటాద్రి, రాయలసీమ, కొల్హాపూర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఉన్నాయి. కానీ ప్యాసింజర్ రైలు ఒక్కటి కూడాలేకపోవడం గమనార్హం గతంలో స్టీమ్ ఇంజిన్ లోకోలతో రైళ్లు నడిచే కాలంలోనే కడప నుంచి తిరుపతికి ప్యాసింజర్(93,94నంబర్లతో) ఉదయం పూట నడిచేవి. ఇప్పుడే ఆ పరిస్థితి లేదని ప్రయాణికులు వాపోతున్నారు.

- నంద్యాల-వైఎస్సార్ ఉభయ జిల్లా వాసులు తిరుపతికి వెళ్లేందుకు అనువుగా ఈ డెమో ప్యాసింజర్ రైలు ప్రయోజనకరమని భక్తులు భావిస్తున్నారు. అయితే ఈ రైలును రేణిగుంట వరకే నడిపిస్తున్నారు. కానీ భక్తులతో పాటు నిత్యం విద్యార్థులు, ఉద్యోగులు, అధికారులు విధుల నిర్వహణ నిమిత్తం తిరుపతికి వెళ్లేవారు అధికంగా ఉన్నారు. ఈరైలును తిరుపతి వరకు పొడిగిస్తే ఉపయోగకరంగా ఉంటుందని ఆదిశగా రైల్వేబోర్డు ఆలోచించాలని కోరుతున్నారు.

పొడిగింపు టైమింగ్స్ ఇలా..

నంద్యాల-కడప డెమో ప్యాసింజర్ రైలును పొడిగింపు చేసే టైమింగ్స్ ఇలా ఉంటాయని రైల్వేశాఖ ప్రతిపాదనలో తెలియజేసింది. నంద్యాలలో 5.50కు బయలుదేరి కడపకు 9.40కి చేరుతుంది. 9.45కు కడపలో బయలుదేరి రేణిగుంటకు 1.30 గంటలకు చేరుతుంది. రేణిగుంటలో తిరిగి 2.30కు బయలుదేరి కడపకు 5.30 కు చేరుతుంది. నంద్యాలకు 9.30కు డెమో చేరుకునేలా టైమింగ్ ఫిక్స్ చేశారు. స్టాపింగ్‌స్టేషన్ల ఒంటిమిట్ట, నందలూరు, రాజంపేట, ఓబులవారిపల్లె, రైల్వేకోడూరు బాలపల్లెలు ఉన్నాయి.